క్లుప్తంగా

ప్రతి యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించాలి



క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో అక్టోబర్ 2 వరకు వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు అన్ని వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. క్రాంతినగర్, సిద్ధేశ్వరం, పురుషోత్తపురం ఆరోగ్య కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. క్యాన్సర్, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంలో ఎవరు నిర్లక్ష్యం చూపవద్దని, పరీక్షలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాతా, శిశు సేవలను కూడా చేయాలన్నారు. వైద్య శిబిరాల్లో అభ ఐడీ గుర్తించాలని, గర్భిణుల పేర్లు నమోదు చేయాలని, సమయ పాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.

ఘనంగా రాట మహోత్సవం



రాట మహోత్సవంలో పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం : స్థానిక గోవింద్ రోడ్డులో యూత్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గమ్మ ఉత్సవాల నిర్వహణకు సోమవారం రాట వేసి శ్రీకారం చుట్టారు. ఇక్కడ గత పదేళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వలంటీర్ వింగ్ సంయుక్త కార్యదర్శి పచ్చిరిపల్లి రాము, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కల్వర్టుపై మూత ఏర్పాటు



మూత వేసిన తర్వాత కల్వర్టు

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం : 'ప్రమాదకరంగా కల్వర్టు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ సిబ్బంది స్పందించారు. వెంకటేశ్వరమెట్ట గుడి నుంచి మూడు గుళ్లకు వెళ్లే దారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గత రెండు నెలలుగా కల్వర్టుపై మూత లేక వాహనచోదకులు తీవ్రంగా గాయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సాక్షిలో సోమవారం ప్రచురించిన వార్తకు జీవీఎంసీ సిబ్బంది స్పందించి కల్వర్టుపై పలక ఏర్పాటు చేశారు. ఎప్పటి నుంచో ఉన్న సమస్యను పరిష్కరించిన సాక్షి పత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలల గృహాల తనిఖీ కమిటీ సభ్యుడిగా నరవ ప్రకాశరావు



అల్లిపురం: బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావును నియమిస్తూ జిల్లా కలెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన బాల గృహాల పని తీరుపై తనిఖీ కమిటీకి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బాలల గృహాలు చట్ట ప్రకారం నిబంధనలు పాటిస్తున్నాయా.. లేదా తనిఖీ చేసి నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తుంది. ఈ నెల 25న జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరగనుంది.

నేటి నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 23, 24న కేరళ మెగా ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన గేట్ ఎదురుగా రాంనగర్ వైద్యరాజ్ ఔషధాలయంలో ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 2 రోజులపాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు అపాయింట్‌మెంట్ కోసం 8008000670, 9133106060లో సంప్రదించాలని సూచించారు.

దుర్గాదేవీ నమోస్తుతే..



కనకమహాలక్ష్మి అమ్మవారికి హారతి ఇస్తున్న ఆలయ ఈవో శోభారాణి



బాల దుర్గాదేవి అలంకరణలో సాగరగిరి కనకదుర్గమ్మ



అల్లిపురం మెయిన్ రోడ్డులో నెలకొల్పిన అమ్మవారు



బాలా త్రిపురసుందరిగా దర్శనమిస్తున్న ఉమాదేవి అమ్మవారు



బాలా త్రిపురసుందరిగా ఎర్నిమాంబ అమ్మవారు

- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం
- వాడవాడలా మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత
- ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సిరులతల్లి
- సాంస్కృతిక కార్యక్రమాలతో నియోజకవర్గానికి ఆధ్యాత్మిక శోభ



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

డాబాగార్డెన్స్ :

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో దక్షిణ నియోజకవర్గం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు శాస్త్రోక్తంగా పూజలు ప్రారంభించారు. కనకమహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణ కవచ అలంకరణలో 108 బంగారు పుష్పాలతో పూజ జరిపారు. అమ్మవారు స్వర్ణ కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరానికి చెందిన నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.45వేలు చెల్లించి స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్నారు. అమ్మవారి అలంకరణకు పట్టు చీరలు లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్వాహకులు అందజేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఆనంద్‌కుమార్ స్వాగతం పలికారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారు 'ఆదిలక్ష్మి' అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించనున్నారు.

- శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేయనున్నట్టు ఈవో తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించే పంచామృతాభిషేకం, ప్రతి మంగళవారం నిర్వహించే అష్టదళ పద్మారాధన, శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకం, శనివారం నిర్వహించే లక్ష తులసి పూజ వంటి విశేష సేవలు, పూజలు నిలిపివేయనున్నట్టు ఈవో తెలిపారు.
- నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి భక్తులతోపాటు మాలలు ధరించిన భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు, సిబ్బంది, భక్తులు, భవానీలు పాల్గొన్నారు. దుర్గాలమ్మ మంగళవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కనకమహాలక్ష్మి ఆలయం నుంచి శోభాయాత్ర

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభ సూచికగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు 108 మంది మహిళలతో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వేకువజామున



బాలా త్రిపురసుందరిదేవిగా దర్శనమిస్తున్న దుర్గాలమ్మ

మూలవిరాట్‌కు అభిషేకం చేసి బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవికి విగ్రహ దాత పాలూరి వర్ధనబాబు దంపతులు తొలి పూజ చేసి దసరా ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్లు పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు శివ, కంకటాల సతీష్ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన కనకదుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం త్రివేణి నృత్యకళా సంస్థచే కూచిపూడి నృత్యం, శ్రీరామ లలితాదేవి గ్రూప్‌చే కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి మంగళవారం లలితాదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు.



దుర్గమ్మను తిరువీధిగా తోడ్కొని వస్తున్న శ్రీదుర్గమ్మ పీఠం ప్రతినిధులు



దుర్గమ్మ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బాల దుర్గాదేవిగా సాగర గిరి కనకదుర్గమ్మ

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ సోమవారం బాల దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. సాయంత్రం పంచహారతులతో పూజలు చేశారు.

- టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి బాల త్రిపుర సుందరిగా అలంకరించారు.
- అల్లిపురం మెయిన్ రోడ్డులోని శ్రీ దుర్గమ్మ పీఠంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని గోకుల్ థియేటర్ దరి శ్రీ రాచపోలమాంబ ఆలయం వద్ద నుంచి తిరువీధిగా నేరెళ్ల కోనేరు, మార్కెట్ రోడ్డు మీదుగా పీఠం వద్దకు తీసుకొచ్చారు. ఇక్కడ ప్రతిష్ఠించిన 20 అడుగుల అమ్మవారి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.
- అచ్చియ్యమ్మపేటలో గల శ్రీ షిరిడీ సాయి దర్బార్‌లో సాయిబాబా సమాధి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుర్గమ్మను నెలకొల్పారు. అర్చకుడు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. దసరా రోజున బాబా సమాధి ఉత్సవం చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఉమ్మిడి నాగరాజు తెలిపారు.

ఎర్నిమాంబకు విశేష పూజలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్.సురేష్‌బాబా ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీకాంతశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం నవ చండీ యాగం నిర్వహించారు, దుర్గాదేవిని ప్రత్యేక పూలతో బాలా త్రిపురసుందరి దేవిగా అలంకరించారు. వాసుపల్లి విజయమ్మ, రామకృష్ణ, ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిరు వ్యాపారులకు అండగా వైఎస్సార్‌సీపీ

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో కేజీహెచ్ వద్ద భారీ నిరసన



కేజీహెచ్ వద్ద చిరు వ్యాపారులకు అండగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

డాబాగార్డెన్స్: కేజీహెచ్ చుట్టూ ఉన్న దుకాణాలు తొలగించేందుకు జీవీఎంసీ సిద్ధం కావడంతో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ చిరు వ్యాపారులకు అండగా.. బాసటగా నిలిచారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్‌తోపాటు పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. కేజీహెచ్ ఓపీ గేట్ నుంచి మెయిన్ గేట్ వరకు అక్కడి చిరు వ్యాపారులతో కలిసి 'ఆపరేషన్ స్టమక్' పేరిట నిరసన ప్రదర్శన చేశారు. రోడ్డుపై బైఠాయించి చిరు వ్యాపారులకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డి రామానంద్, పద్మనాభ అమ్మాజీ, అభిరెడ్డి ఆదివిష్ణురెడ్డి, దశమంతుల చిన్ని, ఈతలపాక విజయ్, సాగర్, బోర విజయలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, వడ్డాది దిలీప్, పచ్చిరపల్లి రాము, సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, రాజారెడ్డి, ముత్తాబత్తుల రమేష్, లింగం శ్రీను, అలపున కనకారెడ్డి, మహ్మద్ షకీల్, గంగళ్ల రామరాజు, గురజాపు రవి, ముజీబ్‌ఖాన్, కోన శంకర్, ఆరుగుల రాజు, గరికిన వెంకటేష్, గుమ్మడి చంద్రమౌళి, గుంటు ఆనంద్, సువార్త రాజు, కృష్ణకుమార్, సూర్యనారాయణ, బొండాడ వెంకటరమణ, వాసుపల్లి బంగారమ్మ, తాడి రవితేజ, పడాల సూర్యకుమార్, బాబ్జి, బెవర మహేష్, నాగమణి, ఆకుల శ్యామ్, కిషోర్, రామలక్ష్మి, సైలాడ భాను, కోరాడ సురేష్, శివ, చేపల ప్రసాద్, సతీష్, రూప, రాము, హేమ, కృష్ణవేణి, రోజా, రమణి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్న చిరు వ్యాపారులు



పేదల కడుపు కొట్టొద్దని ప్లకార్డుల ప్రదర్శన..

జీఎస్టీ ఉపసంహరణతో ప్రజలకు ఉపశమనం



మాట్లాడుతున్న ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్

డాబాగార్డెన్స్: ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణ ప్రజలకు పెద్ద ఉపశమనమని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయం సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన సందర్భంగా ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయ సమీకరణ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై అమల్లో ఉన్న 18 శాతం జీఎస్టీని ఉపసంహరించుకుందన్నారు. ఈ విజయం సాధించడానికి ఏఐఐఈఏ 2004 నుంచి నిరంతరం పోరాటం చేస్తూ వచ్చిందని తెలిపారు. యూనియన్ పిలుపులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలో పలువురు ఎంపీలను కలిసి మెమోరాండం ఇచ్చామన్నారు. పార్లమెంట్‌లో మా వాణి వినిపించి జీఎస్టీ తొలగింపునకు సహకరించిన ఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది ప్రజలకు కొంత ఉపశమనం కలిగించినా.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఈయూ అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, ఐసీఈయూ, బీఏఎస్ఈ యూనిట్ నాయకత్వంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం

- మాజీ సీఎం వైఎస్ జగన్‌ది ప్రజా పాలన : బాణాల శ్రీనివాసరావు



డాబాగార్డెన్స్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ రోజు కూడా పేదల పొట్టలు కొట్టలేదని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీలో ఇంత పెద్ద ఎత్తున విధ్వంసం జరగడం కూటమి ప్రభుత్వానికే చెందిందని, కార్పొరేటర్లు ఎవరూ లేని సమయంలో ఈ తరహాలో బీభత్సం సృష్టించడం తగదన్నారు. ఉద్యోగాల్లేకపోయినా ఏదోలా బతుకుతుంటే.. కూటమి ప్రభుత్వం ఇంతగా విధ్వంసం చేయడం పేద ప్రజల పొట్టలు కొట్టడమేనన్నారు. ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు బాధితులకు బాసటగా నిలిచేందుకు కార్యాచరణ రూపొందించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లందరూ అధ్యయన యాత్ర ముగించుకుని విశాఖ వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని 'సాక్షి'కి బాణాల తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో పేదలందరూ సంతోషంగా ఉండేవారని, కూటమి అధికారంలోకి వచ్చాక పేదలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. ఓటేసి గెలిపించిన బడుగులకు కూటమి సర్కారు ఇచ్చిన బహుమతి ఇదేనా..? అని బాణాల ప్రశ్నించారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యంగా బడ్డీలు, దుకాణాలు పోగొట్టుకున్న బాధితులకు బాసటగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

మహిళా కళాశాలలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్



కళాశాల ప్రాంగణంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ప్రకృతే మానవాళి భవిష్యత్ అన్నారు. అందరూ ఒక్కో మొక్క నాటితే భవిష్యత్ తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్ అందించగలుగుతామన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం వ్యక్తిగత బాధ్యత కాదని, దేశం కోసం సామూహిక బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు చురుగ్గా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పలువురు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కన్వీనర్ ఎస్.నిర్మలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

మద్దిలపాలెం: సమ్మిళితం చేస్తూ దివ్యాంగ చిన్నారులను సాధికారత దిశగా నడిపించాలని ఆంధ్ర విశ్వ విద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని గౌతమ్ బుద్ధ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజైబిలిటీస్, విద్యా విభాగం సంయుక్తంగా పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య కిషోర్ బాబు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగుల్లోని నైపుణ్యాలు, సృజనాత్మకత ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వినీత సింఘాల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం – 2020లో భాగంగా విద్యలో అందరినీ భాగం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న శుభ సమయంలో ఇటువంటి కార్యక్రమానికి ఏయూ తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు. విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ తమ సామర్థ్యం, నైపుణ్యాలు ప్రదర్శించడానికి దివ్యాంగులకు ఈ వేదిక ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. అనంతరం ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ డాక్టర్ బి.వి.రామ్ కుమార్, సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు ప్రసంగించారు.

దుకాణాలు తొలగించడం అన్యాయం



డీఆర్‌వో భవానీశంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహారాణిపేట: ఆపరేషన్ లంగ్స్ పేరుతో నగర వ్యాప్తంగా చిరు వ్యాపారులపై కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్య సరికాదని, ముందుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దుకాణాలు తొలగించడం అన్యాయమని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మ రాజు అన్నారు. ఈ చర్య వల్ల ఎన్నో మధ్యతరగతి, పేద కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని, తక్షణమే ప్రభుత్వం వీరికి ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ కమలాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ నాయకులు జగన్, త్రినాథ్, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు శ్రీను, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వంతో సమగ్రత

మద్దిలపాలెం: భిన్నత్వంలో ఏకత్వంతో సమగ్రత సాధించవచ్చని రోటరీ క్లబ్ సభ్యులు అన్నారు. రోటరీ జిల్లా 3020లో భిన్నత్వం, సమతుల్యత, అంతర్భాగం చేయుట (డీఈఐ) అనే అంశాలపై మద్దిలపాలెం సమీపంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వాల్తేర్ అధ్యక్షుడు ఎ.ఎ న్.టి.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు ప్రసంగించారు. సర్వమత ప్రార్థనలతో ప్రారంభించి, నర్తనశాల నాట్యశాల విద్యార్థులు దేశంలోని 9 రకాల నృత్యాలతో ఆహూతులను అలరించారు. రోటరాక్టర్స్ విద్యార్థులు వివిధ వృత్తులు ప్రదర్శించారు. డీఈఐ జిల్లా చైర్మన్ సత్యశ్రీ దెందుకూరి, సుహాసిని, నందిని, ఛాయాదేవి, కల్యాణ్ చక్రవర్తి, అజయ్ కుమార్ పాల్గొన్నారు.